# పాపం సుబ్రావ్

## వై. కె. మూర్తి

సుబ్రావ్ ఆఫీసులో కూర్చున్నాడన్నమాటే గాని, మనసంతా అదోలా వుండి, ఆలోచనా ప్రవాహంలో ఈదులాడుతున్నాడు. కడుపులో పేగులు రొదపెడుతున్నాయి. (నీ ఆలోచనలు తరువాత.... ముందు మా సంగతి చూడమని). కొత్తగా పెళ్ళయి ముచ్చటగా కాపురం మొదలుపెట్టిన సుబ్రావ్‌కి అంతలేసి ఆలోచనలేమిటా.... అని అనుమానం రావచ్చు. కాని కారణం తెలిస్తే అయ్యో... పాపం! అన్పించకమానదు. ఇంతకీ అతనిని వేదించే సమస్య.... భార్యామణిగారి చేతివంట. కాపురం పెట్టిన మొదటి రెండ్రోజులూ అవీ యివీ సర్దుకునే హడావిడిలో, హోటల్లో భోంచేసేవారు. అప్పుడు కాస్త కడుపునిండా ఏం తిన్నాడో.... అంతే! ఆ తర్వాత అంటే భార్యగారు వంట మొదలు పెట్టిన దగ్గర్నుండి, ఆవిడ చేతి అమృతం ఆస్వాదించలేక, కొత్తలోనే వంకలు పెట్టి, ఆవిడ మనసు నొప్పించలేక, కొత్తలోనే వంకలు పెట్టి, ఆవిడ మనసు నొప్పించలేక ఎంతో బాధ పడుతున్నాడు.

అలా బోల్డంతసేపు ఆలోచించగా... చించగా... గొప్ప ఐడియా తట్టింది సుబ్రావ్ బుర్రకి. ఆహా! ఏమి నా తెలివితేటలు..... ఈ దెబ్బతో మన కష్టాలన్నీ గట్టెక్కినట్టే అనుకుంటూ, హుషారుగా ఆఫీసుపని తెమాల్చుకుని, సాయంత్రం అయిదు అవగానే, బయటపడి, తిన్నగా ఓ పుస్తకాల షాపుకేసి దారితీశాడు. వంటకి సంబంధించిన పుస్తకాలేవైనా వుంటే ఇమ్మన్నాడు, షాపువాడు అందుకే ఎదురుచూస్తున్నట్లు, టకీమని ఓ పుస్తకం తీసి, 'ఇది చాలా మంచి పుస్తకం సార్, కొత్తగా వచ్చింది. వెల కూడా తక్కువ' అంటూ ఓ పుస్తకాన్నిచ్చాడు. సుబ్రావ్ అది ప్యాక్ చేయించి, డబ్బు చెల్లించి ఇంటిదారి పట్టాడు. మొన్నామధ్యనెప్పుడో ఓ ఫ్రెండ్ ఇంటికెళ్తే 'వంటా – వార్పు' అనే పుస్తకం కనిపించింది. అది గుర్తు రాబట్టి ఇప్పుడు తన సమస్య పరిష్కారమయింది అనుకుంటూ, తన తెలివినీ, జ్ఞాపకశక్తినీ అభినందించుకుంటూ, ఇంట్లో అడుగుపెట్టాడు.

'సరూ.... ఓ సరూ.... త్వరగా రా' అంటూ ఓ కేక పెట్టాడు. వంటింట్లో వంకాయ కూరతో కుస్తీ పడుతున్న సరోజ గాభరాగా పరిగెత్తుకొచ్చింది. చేతులు వెనక్కి పెట్టుకొని, నేనేం తెచ్చానో చెప్పుకో- అంటున్న సుబ్రావ్‌ని మురిపంగా చూస్తూ 'చీర....' అంది. (అబ్బబ్బ ఈ ఆడవాళ్ళకి చీరలూ, నగలూ తప్ప మరో ఆలోచన రాదు గదా, అని మనసులో అనుకొని) 'కాదు', అన్నాడు. 'ఏంటబ్బా' అని బుగ్గన వేలుంచుకొని, కాసేపు దీర్ఘాలోచనలో పడి, పొయ్యిమీద కూర మాడు వాసన రావడంతో కంగారుగా వంటింటివైపు వెళ్ళింది. ఏం తెచ్చారో అనే ఆశ నిలువనీయక, అది అలా దించి పెట్టేసి, మళ్ళీ వచ్చింది. సుబ్రావ్‌కి ఆ వాసనకి తల తిరిగినా, రేపటినుండి పుస్తకం వుందిగా.... అని తన్ను తాను ఓదార్చుకుని, 'ఇంకోచాన్స్' అన్నాడు. 'ఓడిపోయాను గానీ, త్వరగా చెప్పండీ.... ' అన్న సరోజ కనులముందు ప్యాకెట్ వుంచాడు.

గబగబా విప్పి, పుస్తకం చూసిన సరోజ ఆశ్చర్యపోయి, 'అరె! ఈ పుస్తకమా! ఇది మీ కెక్కడిది?' అంది. సుబ్రావ్ గర్వంగా నవ్వుతూ, 'షాపులో కొన్నాను. నువ్వు ఇకనుండి ఈ పుస్తకం చూసి, వంట చెయ్యాలి' అన్నాడు. 'కొనడమేమిటండీ ఖర్మ. అసలు పుస్తకం ఎవరు వ్రాశారో, ఏమిటి? అని ఏమైనా చూశారా?' అంది. 'ఏం? మంచి పుస్తకం కాదా? నచ్చకపోతే ఇచ్చేసి ఇంకోటి తెస్తానులే' అన్నాడు.

'మహాశయా.... ఒక్కసారి ఇటు చూడండి' అంటూ పేజీ తిరగేసి, రచయిత్రి పేరు చూపించింది సరోజ. రచయిత్రి పేరు – డి. సరోజ, 'అంటే... అంటే....' అన్నాడు గుటకలు మింగుతూ.

'ఆ సరోజే – ఈ సరోజ. ఆ పుస్తకం పెళ్ళి కాకముందు వ్రాశాను. పెళ్ళి హడావుడిలో చెప్పడం మరిచాను. నా దగ్గర కూడా కాపీలున్నాయి. వాటిలో వంటలే కదా రోజూ చేస్తున్నాను. మీరు చూసి తెచ్చారేమో అనుకుంటున్నా సుమా' అంటూ ఉపన్యాసం దంచుతున్నదల్లా. 'హతోస్మి' అంటూ కుర్చీలో దబ్బుమని పడిపోయిన సుబ్రావ్‌ని చూసి, విషయం అర్థం కాక, నీళ్ళు తెచ్చి జల్లుదామని వంటింట్లోకి పరిగెత్తింది శ్రీమతి సరోజా సుబ్రావ్ 'ది గ్రేట్ వంటల' రచయిత్రి.


## బాలతేజం

(బాలల సచిత్ర మాస పత్రిక)

సంపాదకుడు : సీతారామారావు నండూరి

వెల : రూ. 12/-

వార్షిక చందా : రూ. 132/-,

ఎం.ఓ, లేదా డి.డి.

బాలతేజం పేర పంపాలి.




చిరునామా : బాలతేజం

బాలల సచిత్ర మాస పత్రిక, 32-5-10, పాపయ్య స్ట్రీట్

సీతారాంపురం, విజయవాడ - 520 002

ఫోన్ : 0866-2437622

BAALA TEJAM is available in ENGLISH also